క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



కృష్ణా: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ వెంకటయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం వెలుగు అభ్యాసన మిత్ర మెటీరియల్ పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించి ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ నరేష్, సీఆర్పీ అమీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ ఏర్పాటును అడ్డుకోవాలి



మరికల్: మండలంలోని చిత్తనూర్‌లో ఇథనాల్ కంపెనీ ఏర్పాటును రాజకీయ పార్టీల నాయకులు అడ్డుకోవాలని పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. కంపెనీకి వ్యతిరేకంగా గురువారం చిత్తనూర్‌లో చేపట్టిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఇథనాల్ కంపెనీలను రాజకీయ నాయకులు కలిసికట్టుగా వ్యతిరేకించారని, ఇక్కడ మాత్రం నోరు మెదడపం లేదన్నారు. జీవకోటి మనుగడకు ప్రమాదకారంగా మారే కంపెనీ ఏర్పాటును అడ్డుకోవాలని కోరారు.

నాయిబ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక



మాగనూర్: మండలంలోని వడ్వాట్‌లో గురువారం నాయిబ్రాహ్మణ సంఘం గ్రామ కమిటీని జిల్లా అధ్యక్షుడు పాండు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సురేష్, అధ్యక్షుడిగా అమ్రేష్, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా బాలరాజు, సలహాదారుడిగా కురుమూర్తి, సహాయ కార్యదర్శిగా వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా అనిల్, మూలింటి వెంకటేష్, నరేందర్, శ్రీనివాసులు, అంజి, రాజకుమార్, ఆనంద్, ప్రవీణ్, రమేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ సభ్యులను జిల్లా నాయకులు శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో రవి, రాజు, అశోక్, శంకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పెంచాలి



మాగనూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యం పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని మాగనూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింహులు సూచించారు. మండలంలోని పలు పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. వెలుగు అభ్యాసన మిత్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో పాఠనాశక్తి, చేతిరాత వంటి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పిల్లల్లో ప్రగతి సామర్థ్యాల పెంపుపనకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వెలుగు అభ్యాసన కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

కోస్గి: తెలంగాణ ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని హకీంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల అధ్యాయన కేంద్రం ఇంచార్జీ కోఆర్డినేటర్ రాములు, హెచ్‌ఎం మల్లికార్జున్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఆసక్తి ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు అధ్యాయన కేంద్రంలో లేదా 7207092435 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ట్యాంకులు ఇలా..నీళ్లు తాగేదెలా?

- అపరిశుభ్రంగా మినీ వాటర్‌ట్యాంకులు
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

నారాయణపేట టౌన్: మనిషి ఆరోగ్యానికి తాగు నీరు ఎంతో ముఖ్యం. సురక్షిత జలంతో పలు వ్యాధులు దరి చేరకుండా అరికట్టవచ్చు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న తాగునీటిని సరఫరా చేసే ట్యాంకులను అధికారులు గాలికొదిలేశారు. నెలల తరబడి వాటిని శుభ్రం చేయకపోవడంతో అధ్వానంగా మారాయి. పట్టణంలోని హరిజన వాడ, పాత ఎస్సీ కాలనీ, పళ్ల, శ్రీనగర్‌కాలనీ, భీవండి కాలనీ, దూల్‌పేటలో మినీ వాటర్‌ట్యాంకులను శుభ్రం చేయడంలేదని ప్రజలు వాపోతున్నారు. మిషన్ భగీరథ పథకం పైపులైన్లకు లీకేజీలతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే అపరిశుభ్రంగా మారిన ట్యాంకుల నీరే దిక్కవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ట్యాంకులకు పై కప్పులు లేకపోవడంతో వర్షపునీరు అందులోకి చేరి కలుషితమవుతున్నదని, దుర్వాసన వస్తుందని పేర్కొంటున్నారు. మరో ప్రత్యామ్నాయం లేక ట్యాంకుల నీటిని వినియోగించుకోవాల్సిన దుస్థితి నెలకొన్నదని వాపోయారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించడంపై సంబంధిత అధికారులు శ్రద్ధ చూపడంలేదు. దీంతో వానాకాలంలో వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్‌ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



పళ్ల వీధిలో అపరిశుభ్రంగా ఉన్న వాటర్‌ట్యాంకు

బీఆర్‌ఎస్ హయాంలోనే నాణ్యమైన విద్యుత్



ధన్వాడ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నారాయణపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు నాణ్యమైన విద్యుత్ నిరంతరం సరఫరా చేస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయసాగర్ అన్నారు. రైతులకు 3గంటల కరెంట్ ఇస్తే చాలని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై గురువారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట పట్టణ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, టీడీపీ హయాంలో రైతులు కరెంట్ కోతలతో నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. రైతులకు నాణ్యమైన ఉచిత కరెంట్, ఎరువులు, పంట పెట్టుబడి సాయం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. రైతు సంక్షేమం చూసి ఓర్వలేక ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మొసటి జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, చంద్రకాంత్, కౌన్సిలర్లు బండి రాజేశ్వరి, అమ్మపల్లి శిరీష, మహేష్, గురులింగం, కోఆప్షన్ సభ్యుడు విద్యావతి, కన్న జగదీశ్, రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీపాద్, కార్తీక్, గట్టు విజయ్, వినోద్ పాల్గొన్నారు.



నారాయణపేటలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ధన్వాడ: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు ఉరివేసి బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రైతులకు నిరంతర విద్యుత్ కాకుండా 3గంటలు ఇస్తే సరిపోతుందని రేవంత్‌రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, సర్పంచ్ అమరేందర్‌రెడ్డి, గండి బాల్‌రాజు, చంద్రశేఖర్, పటేల్ నర్సింహులు, సుధీర్‌కుమార్, సచిన్, శివారెడ్డి, సత్యనారాయణ, వీరేష్ పాల్గొన్నారు.

పరామర్శ

నర్వ: మండల కేంద్రానికి చెందిన చిన్నబుచ్చన్న అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో మాజీ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. చిన్నబుచ్చన్న మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

బీటీరోడ్డు నిర్మాణంపై హర్షం



ఊట్కూరు: మండల కేంద్రంలో గురువారం బీటీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బస్టాండ్ నుంచి గాంధీనగర్ వరకు 1 కి.మీ. మేర బీటీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కృషితో నిధులు మంజూరైనట్లు తెలిపారు. గ్రామస్తుల ఆకాంక్ష మేరకు బీటీరోడ్డు నిర్మించడంపై ఎంపీపీ ఎల్కోటి లక్ష్మీ, సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎఫ్‌పీఓ కేంద్రం ప్రారంభం



మక్తల్: మండలంలోని కర్నిలో ఏర్పాటు చేసిన ఎఫ్‌పీఓ కేంద్రాన్ని సర్పంచ్ అక్రమ్, ఎంపీటీసీ రంగప్ప గురువారం ప్రారంభించారు. కర్ని, రుద్రసముద్రం, పంచలింగాల గ్రామాల రైతులకు ఫర్టిలైజర్, పురుగుమందులు అందుబాటులో ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పురుషోత్తం, హన్మంతు, రామేశ్వర్‌రెడ్డి, ఖలీల్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నారాయణపేట రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సర్పంచ్ సుగుంధమ్మ అన్నారు. మండలంలోని జాజాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వాలీబాల్ అకాడమీని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి చెందిన కోట్ల ధీరజ్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుడు శ్యాంసుధాకర్ రెడ్డి వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కనకప్ప, డీఎస్‌ఓ భానుప్రకాష్, రైతు నాయకులు కోట్ల జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, తిప్పారెడ్డి, సురేష్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



వాలీబాల్ కిట్లను అందజేస్తున్న సర్పంచ్

ఇంటింటికీ కాంగ్రెస్



నర్వ: యూత్ జోడో..బూత్ జోడోలో భాగంగా గురువారం మండలంలోని ఉందేకోడ్‌లో ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాంసింగ్‌నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తులసీరాజ్‌యాదవ్, మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ నీరజ్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, అయ్యపురెడ్డి, సంజీవరెడ్డి, రామన్‌గౌడ్, శ్రీనివాసాచారి, రవి, రాము పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటుహక్కు పొందాలి



అఖిలపక్ష నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మమత

కోస్గి: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందాలని తహసీల్దార్ మమత కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా, నూతన పోలింగ్ బూతుల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. అర్హులందరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని కోరారు. 1500 మందికిపైగా ఓటర్లు ఉంటే కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తుడుం శ్రీనివాస్, ఇద్రీస్, భానునాయక్, ఎంఐఎం నాయకుడు అంజద్‌ఖాన్, సీపీఐ నాయకుడు శ్రీనివాస్, టీడీపీ నాయకుడు అంబదాస్ తదితరులు ఉన్నారు.

లయన్స్‌క్లబ్ గవర్నర్‌గా బట్టడ్ ప్రమాణస్వీకారం

నారాయణపేట రూరల్: లయన్స్ క్లబ్ 320ఏ గవర్నర్‌గా నారాయణపేటకు చెందిన హరినారాయణ్ బట్టడ్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా ఉన్న ఆయన కొన్నేళ్లుగా లయన్స్ క్లబ్ సభ్యుడిగా వివిధ హోదాల్లో పనిచేసి తాజాగా గవర్నర్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు అమెరికాలో జరిగిన కార్యక్రమంలో లయన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన గవర్నర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. లయన్స్ క్లబ్ సభ్యులు మొల్గాన్ జనార్దన్, వెంకటయ్య, సాయినాథ్, రవికుమార్‌గౌడ్, ఆత్మారాం, సుదర్శన్‌రెడ్డి, గందె రవికాంత్, మధుసూదన్‌రెడ్డి, శేర్ కృష్ణారెడ్డి, ఎస్పీ బాలుఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, శ్రీసాయి కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి జనార్దన్‌రెడ్డి తదితరులు హరినారాయణ్‌కు అభినందనలు తెలిపారు.



లయన్స్ క్లబ్ బాధ్యులతో బట్టడ్

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కోస్గి: ఈ ఏడాది కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన వారు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ తిరుపతి సూచించారు. ముశ్రీఫా క్లస్టర్ పరిధిలోని ముంగిమళ్లలో గురువారం అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, నామినీ ఆధార్ జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కూలీల భారం తగ్గింది..



లింగంపల్లి శివారులో కల్టివేటర్లతో కలుపు తీస్తున్న కూలీలు



కర్రలకు అమర్చిన కల్టివేటర్లు

- కల్టివేటర్ సహాయంతో పత్తిచేనులో కలుపు తొలగింపు

మక్తల్: పత్తిచేనులో కలుపు తొలగించేందుకు కూలీల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇందుకోసం రైతులు వేలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఒక్కోసారి కూలీల కొరత ఏర్పడుతుంది. వీటన్నంటికీ చెక్ పెడుతూ రైతులు కల్టివేటర్ వినియోగిస్తున్నారు. కర్రలకు కల్టివేటర్ అమర్చి పత్తిచేనులో కలుపు తొలగిస్తున్నారు. మక్తల్ మండలం లింగంపల్లి గ్రామశివారులో ఓ రైతు ఐదుగురితో కలిసి ఒక్క రోజులోనే మూడెకరాల వరకు కలుపు తీయించారు. 20–15మంది చేసే పనిని కేవలం ఐదుగురితో చేయవచ్చని రైతు తెలిపారు.

చదువుతోనే బంగారు భవిష్యత్

మాగనూర్: చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని జీవితంలో ఉన్నతంగా రాణించాలని జెడ్పీటీసీ వెంకటయ్య సూచించారు. మండలంలోని తళంకేరి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి మెరుగైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామస్వామి, హెచ్‌ఎం నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ వెంకటయ్య

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



జౌళ్లాపూర్‌లో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- పంచాయతీ భవనాలకు శంకుస్థాపన

మక్తల్: గ్రామాలను అన్నివిధాలా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగంపల్లి, ఉప్పర్‌పల్లి, టేకులపల్లి, సామాన్‌పల్లి, ముష్టిపల్లి, జౌళ్లాపూర్ గ్రామాల్లో గురువారం పంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 500 జనాభా ఉన్న గ్రామాలు, తండాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసి ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. నూతన పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున కేటాయించినట్లు చెప్పారు. మక్తల్‌లో 150 పడకలు ఆస్పత్రిని ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రహరీ నిర్మాణానికి రూ.15లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో 6 గురుకులాలను ఏర్పాటు చేసి 800మంది విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్య అందిస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు రూ.4,016 పింఛన్ అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ఇతర పార్టీల నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ పావని, ఏఈ లక్ష్మినారాయణ, సర్పంచులు దత్తు, సుజాత, శ్రావణి, బాలమ్మ, వెంకటప్ప, ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీలు గుడిగండ్ల లక్ష్మి, బాల్‌రాంరెడ్డి, లత, సుమిత్ర, వెంకటప్ప, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, కుర్మయ్య, నేతాజీరెడ్డి, సీతారామారావు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్నాం..

నర్వ: కొత్తపల్లి గ్రామస్తులకు నిచ్చిన హామీ మేరకు గజ్జలమ్మ వాగుపై బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లి, పెద్దకడ్మూర్ గ్రామాల మధ్యనున్న గజ్జలమ్మ వాగుపై సీడీఎఫ్ నిధులు రూ.50లక్షలతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం మండల కేంద్రంలో రూ.10లక్షలతో వాల్మీకి భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయరాములుశెట్టి, వైస్‌ఎంపీపీ వీణావతి, సర్పంచులు సంధ్య, సుజాత, ఉపసర్పంచ్ రాజారెడ్డి, సింగిల్ విండో వైస్‌చైర్మన్ లక్ష్మన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు మండ్ల చిన్నయ్య, అయ్యప్ప, నర్సింహులు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల జోలికి వస్తే ఖబడ్దార్

నారాయణపేట: రైతులకు అందిస్తున్న విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడ వేపూర్తి రాములు, సీనియర్ నాయకుడు గందె చంద్రకాంత్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శ్రీపాద్ హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ సరఫరాపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. రైతుల జోలికి వస్తే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఒకవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించాలని.. మరోవైపు రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యలను చూస్తుంటే వారికి రైతులపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో 24 గంటలపాటు విద్యుత్‌ను వ్యవసాయరంగానికి ఉచితంగా అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాంగ్రెస్ హయాంలో విద్యుత్ కోతలతో పంటలు పండక.. చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, కౌన్సిలర్ బండి రాజేశ్వరి, గురులింగం, నాయకులు విజయ్‌సాగర్, సుదర్శన్‌రెడ్డి, కతలప్ప, చెన్నారెడ్డి, వినోద్, సురేందర్ రెడ్డి, బోయ లక్ష్మణ్, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

65వ రోజుకు చేరిన రిలే దీక్ష

నారాయణపేట రూరల్: కోటకొండను మండల కేంద్రం చేయాలని చేపట్టిన రిలే నిరాహారదీక్ష గురువారంతో 65వ రోజుకు చేరింది. తిర్మలాపూర్ నుంచి మైనార్టీలు ర్యాలీగా శిబిరానికి తరలివచ్చి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో ఐదు కొత్త మండలాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. అన్ని అర్హతలు ఉన్న కోటకొండను విస్మరించడం సరికాదన్నారు. ప్రజా ఆకాంక్ష మేరకు కానుకుర్తి, గార్లపహాడ్‌లను కలిపి కోటకొండ మండలం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదగిరి, ఆంజనేయులు, కాశీనాథ్, వెంకట్రాములు, రాజు, బాలప్ప, చెన్నప్ప, హాజిమలాంగ్, విజయలక్ష్మి, ప్రవీణ్, సునీత, నజీమాబేగం, సౌజన్య, రాములు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కార్మికుల వినూత్న నిరసన



ఊట్కూరులో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నారాయణపేట రూరల్: పంచాయతీ కార్మికుల సమ్మె గురువారం కొనసాగింది. మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో కార్మికులు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకుడు బలరాం కార్మికులకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహులు, రాంచందర్ పాల్గొన్నారు.

మక్తల్: పంచాయతీ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, వెంకటేష్, భగవంతు పాల్గొన్నారు.

కృష్ణా: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ జిల్లా నాయకుడు ఆంజనేయులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తాయప్ప, నరేష్, పద్మమ్మ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల కేంద్రంలో కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సుశాంత్, హన్మంతు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలో మహిళా కార్మికులు బొడ్డెమ్మ ఆడారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమ్మెకు ప్రజాసంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో వెంకటేష్, అంజిలప్ప, భీములు పాల్గొన్నారు.



మక్తల్‌లో..



నారాయణపేటలో..